# భ్రమర!!

భ్రమర, మల్లికార్జునుల దివ్య ప్రేమ కథ ఇది

ఆమె పేరు భ్రమర! వారెడేసి కళ్ళు చేపల్లా వున్నాయి! ఇంద్రకీలాద్రిపై పుష్పాలను సేకరించి మల్లికార్జున స్వామికి అలంకారాలు చేస్తోంది. ఎంత అందమయిన స్వామి!

మల్లికలతో అలంకరిస్తే పాల సముద్రంలోంచి అప్పుడే ప్రభవించిన బాలేందు మూర్తిలా కనిపిస్తాడు.

మందార 'పూలతో ముంచెత్తిన వేళ ఎర్రని తూర్పు వాకిళ్ళు తెరుచుకుని వచ్చే బాలభానుడల్లే తరళిస్తాడు. ఆ స్వామిని చూచుకునేందుకు ఎన్ని కన్నులున్నా చాలవుకదా!

పూవులతో అర్చించుకునేందుకు ఎన్ని చేతులున్నా చాలవు. భ్రమర చేపల్లా తరళించే వారెడేసి కళ్ళు స్వామి మీదనే నిలిపి అపురూపంగా చూసుకొంటోంది.

''బాలేందు శేఖరా! ఎంత సుందరుడవయ్యా నువ్వు. నిన్ను చూసిన క్షణం నా బ్రతుకులో అద్భుతమయిన ముహూర్తం. నీ పూజలో మనసు లగ్నం చేసిన అద్భుతమయిన ఈ ప్రొద్దులు నా జీవితంలో విరబూచిన కాంతిరేఖలు. ఆనాడు ఎప్పుడో పార్వతీదేవి నీ కోసం తపస్సు చేస్తే దయచూపి కల్యాణ తిలకం దిద్దినావట కదా!

నీ పూజలో మనసు లగ్నంచేసి ఏండ్లూ పూండ్లూ గడచినాయి. కాని నన్ను చిన్నచూపు చూసినావు. నన్ను కరుణించవా కల్యాణమూర్తీ! ఈ బ్రతుకుని అందుకో! నాకు నీ పాదాల దగ్గర చోటు చూపించు. చావు బ్రతుకుల మధ్య కొద్ది పాటి యాత్ర కదా మానవ జీవితం. నా ఉసురులు ఆ పాంతమయేలోగా ఒకసారి దర్శనమివ్వు! నీ పవిత్ర చరణ పల్లవాలను నా అశ్రుధారలతో అభిషేకించ నివ్వు!

దర్శన మీయవా త్రిపురాంతకా! ఆనాడు పర్వత రాజ పుత్రి అయిన అంబను అక్కున చేర్చుకున్న విధంగానే నన్ను కూడా అక్కున చేర్చుకో! కల్యాణ మాల మెడలో వేసి నన్నాదరించు. నీ అర్థాంగిగా నన్ను స్వీకరించు'' అంటూ ధ్యానించిందామె!

మల్లికార్జున స్వామి మాట్లాడలేదు.

దూరం నుంచి గుర్రపు డెక్కల చప్పుడు వినిపించింది. ఆమె ధ్యాన ముద్ర భగ్నమయిపోయింది. తల త్రిప్పి చూచింది.

జవనాశ్వం దుమ్ము లేపుకుంటూ దగ్గరగా వచ్చింది. దాని మీదినించి ఒక దీర్ఘకాయుడు క్రిందికి లంఘించాడు. అతడు ఆకాశం నించి రాలిపడుతున్న ఉల్కలా దూకాడు.

మేఘాల మధ్య మెరుపులా వున్న యక్షిణి వజ వజ వణికిపోయింది.

''ఓహో! యక్ష భామినీ ఇక్కడున్నావా నీవు? ఏమి నీ చాపల్యము. ఈ పౌండ్రకు ని అంతఃపుర వాసం నీకు కల్పించాలనుకున్నాను. అదృష్ట దేవత ఆదరించి వస్తే కాలదన్నుకుంటున్నావు కాంతా!

ఆంధ్ర మహా సామ్రాజ్య అధినేతలకు అనుంగు మిత్రుడీ పౌండ్రీక మహారాజు. నన్ను కాదనటం నీ అజ్ఞానం!

మాహిష్మతీ నగరానికి తిరిగి రా! నిన్ను మహారాణిని చేస్తాను. దాస దాసీ జనాలతో సపర్యలు చేయిస్తాను. నీ అందచందాలకు అర్థం కల్పిస్తాను ప్రేయసీ!

ఎందుకు నీ బ్రతుకు అడవి కాచిన వెన్నెల చేసుకుంటావు. నీ సౌకుమార్యాన్ని ఈ కఠిన శిలల మధ్య చేజార్చుకుంటావు?''

''ఓయీ రాజా! నా మనసు పరాధీనమయినదోయీ!''

''మగువా నీ మనసెవరికి అర్పించినావు?''

''ఇంద్రకీలాద్రిపై నున్న మల్లికార్జున స్వామికి!''

''ఒక గుండ్రాయికి మనసిచ్చినావా మానవతీ?''

''అది గుండ్రాయి కాదు! ఈ సమస్త సృష్టికీ కలికితురాయి.''

''శివుడు ప్రేత భూములలో సంచరించే లయకారుడు.''

''అవునయ్యా! మనిషిలో రాగ ద్వేషాలను లయింప జేసే మహనీయ మహాదేవుడు. అందుకే ప్రేమించాను.''

''ఆ రాతి బొమ్మ నీతో మాట్లాడుతుందా?''

''మాట్లాడకున్నా మనసుకి సందేశాలనందిస్తుంది.''

''భ్రమపడుతున్నావు భ్రమరా! పార్వతితో నిన్ను నీవు పోల్చుకుంటున్నావు''

''పరమేశ్వరుడు అనుగ్రహిస్తే పార్వతినే అవుతాను.''

''నా వాల్లభ్యం నీకు అక్కరలేదా?''

''జగద్వల్లభుడే నా ఎదురుగా వున్నాడు.''

''పౌండ్రకుని ఎదిర్చి నిలువగలవా?''

''పశుపతి నా అండగా వున్నాడు.''

''రాజుని తిరస్కరించి నీవు బ్రతుకగలవా?''

''నెల రాజునే నెత్తిమీది జటాజూటికలో తురుముకున్న ఈ పరేత రాజుకన్నా నువ్వు గొప్ప రాజువా?''

''అయితే నిన్ను ఈ ఖడ్గానికి ఎర చేస్తాను. పౌండ్రక రాజ ఖడ్గ ప్రహారం నించి నిన్ను ఆ పరేత రాజు ఎలా కాపాడుతాడో చూస్తాను'' అంటూ సర్రున ఒర నించి ఖడ్గాన్ని లాగాడు పౌండ్రకుడు.

''శివాజ్ఞ లేనిదే చీమయినా కుట్టదు'' అంటూ తల వంచింది భ్రమర! కృష్ణా నది మీద తీతువు పిట్టలు అరిచాయి.

''ఆగాగు పౌండ్రకా! ఆగాగు'' మేఘాలను చీల్చుకు వచ్చిన గర్జనలా గంభీరమయిన కంఠధ్వని వినిపించింది.

పౌండ్రక రాజు తల త్రిప్పి చూచాడు.

''స్త్రీ వధ మహా పాపం అని తెలియదా పౌండ్రకా! అంజలి పట్టి తలవంచిన ఆడదాన్ని వధించే వాడవు నీవేమి మగవాడవు?''

''అధిక ప్రసంగం చేయకు.. ఎవరు నీవు?''

''నన్ను గుర్తించలేదా పౌండ్రక రాజా! ఆంధ్రులు పౌండ్రక రాజులూ కురుక్షేత్రానికి వచ్చారు కదా! అప్పుడు నన్ను చూడలేదా?''

''కురుక్షేత్ర యుద్ధంలోంచి బయటపడినవాడవా? అంటే కౌంతేయుడవా? కౌంతేయాగ్రజునిలా వున్నావు''

''అవునవును. ధర్మజుడను. మహేంద్రగిరులు దర్శించాను. శ్వేత గిరులు దర్శించాను. దక్షిణ సముద్రంలో స్నానం చేయమని దైవజ్ఞులు విధించారు. ఆ ప్రయత్నంలో దక్షిణాది నదుల్లో స్నానం చేస్తూ దిగ్విజయాలు సాధిస్తున్నాను.

గౌతమీ నదిలో పాప విముక్తి అయేలా పుణ్యస్నానం చేశాను. కృష్ణా నదిలో పవిత్ర స్నానం చేసి మల్లికార్జున స్వామిని దర్శించేందుకు వచ్చాను.

ఈ దృశ్యం నా కంట పడింది తప్పుకదా నాయనా!'' అన్నాడు ధర్మజుడు.

పౌండ్రకుడు తలఎత్తి చూచాడు.

ధర్మజుని సేనలు అతన్ని చుట్టుముట్టాయి. చేయగలిగింది ఏమీ లేక తల దింపుకుని వెళ్ళిపోయాడు.

అలాగే తపస్సమాధిలోకి వెళ్ళిపోయింది భ్రమర.

ధర్మరాజు మూడు సముద్రాల స్నానం ముగించి వచ్చిందాకా ఆమె తపస్సు చాలించలేదు. చుట్టూ పుట్టలు పెట్టాయి.

ధర్మజుడు వల్మీకంలోంచి వినిపించే ప్రణవ భ్రమర నాదం విన్నాడు. అందులో భ్రమర ఉన్నదని అర్థమయింది.

ఆ పుట్ట వున్నచోటున భ్రమరాంబా మల్లికార్జునులకు ఆలయం కట్టించాడు.

ఫాల్గుణ శుద్ధ పాడ్యమినాడు భ్రమరాంబా మల్లేశ్వరులకు కల్యాణం ఏర్పాటు చేయించి హస్తినగరికి తిరిగి వెళ్ళిపోయాడు.

కొండమీద దుర్గా మల్లేశ్వరుడు!
కొండ క్రింద భ్రమర మల్లేశ్వరుడు!!
ఇంద్ర కీల గిరులు పులకించినాయి!!

— లల్లాదేవి